

సైన్స్ టీచర్‌ను కొనసాగించాలి


ఎంఇఒకు వినతిపత్రం ఇస్తున్న సర్పంచ్

ప్రజాశక్తి-అరకులోయ రూరల్: మండలంలోని మాదల పంచాయతీ నందివలస ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో పనిచేస్తున్న సైన్స్ టీచర్‌ను కొనసాగించాలని సర్పంచ్ వి శ్రీనివాసరావు, విద్యార్థుల తల్లిదండ్రులు కోరారు. బుధవారం ఎంఇఒకు వినతి పత్రం అందజేశారు. అనంతరం సర్పంచ్ వి శ్రీనివాసరావు మాట్లాడుతూ నంది వలస పాఠశాలలో కొన్నేళ్లుగా పనిచేస్తున్న ఉపాధ్యాయుడిని వేరే పాఠశాలకు డెప్యుటేషన్‌పై పంపుతున్నారని, దీంతో పాఠశాలలోని 190మంది విద్యార్థుల పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. అధికారులు తక్షణమే డెప్యుటేషన్ ఉత్తర్వులు రద్దు చేయాలని కోరారు.

గిరిజన గురుకుల కాలేజీల్లో తాగునీటి సమస్య పరిష్కరించండి


ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులకు వినతిపత్రం ఇస్తున్న ఆదివాసీ గిరిజన సంఘం నేత సురేంద్ర

ప్రజాశక్తి- అరకు రూరల్ : అరకువేలిలోని ఎపి ప్రభుత్వ రెసిడెన్సియల్ జూనియర్ కళాశాలలో మంచినీటి సమస్యను పరిష్కరించాలని .ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర డిమాండ్ చేశారు. బుధవారం ఆర్డబ్ల్యూఎస్ అధికారులకు వినతి పత్రం అందజేశారు. కిల్లో సురేంద్ర ఆధ్వర్యంలో గురుకుల కళాశాలను సందర్శించిన ఆదివాసీగిరిజన సంఘం బృందం, విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై సర్వే చేశారు.

ఈ సందర్భంగా ఆదివాసి గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర మాట్లాడుతూ, అరకులోయ గిరిజన గురుకుల కళాశాలలో ప్రధానంగా తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని విద్యార్థులు ఆవేదన చెందుతున్నారన్నారు. . కళాశాలలో 250 మంది గిరిజన విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారని, వారు నిత్యం కాలకృత్యాలు, ఇతర అవసరాలకు సరిపడా నీరు లేకపోవడంతో, తరగతులకు సకాలంలో వెళ్లలేకపోతున్నారన్నారు. తాగునీరు, మరుగుదొడ్లు వంటి కనీస సౌకర్యాల కల్పనలోనూ సంబంధిత అధికారులు నిమ్మకునీరెత్తినట్లు నిర్లక్ష్యంగా ఉండడంపై సురేంద్ర మండిపడ్డారు. కాంట్రాక్టుఅధ్యాపకులకు రెన్యువల్ చేయకపోవడంతో వారు సమ్మెబాట పట్టారని, దీంతో తరగతులు సాగక విద్యాబోధన కుంటుపడుంతోందన్నారు. తక్షణమే గురుకులం అధ్యాపకులను రెన్యువల్ చేసి,, వారికి ఉద్యోగ భద్రత కల్పించడడంతోపాటు, సజావుగా విద్యాబోధన సాగే చర్యలు చేపట్టాలని సురేంద్ర డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం మండల అధ్యక్షులు గత్తుం బుజ్జిబాబు, కిండంగి రామారావు పాల్గొన్నారు.

వంజంగి తారురోడ్డు నిర్మాణానికి రూ.2.50 కోట్ల నిధులు మంజూరు

● ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి వి అభిషేక్


వంజంగి సందర్శనలో ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి అభిషేక్

ప్రజాశక్తి -పాడేరు : ప్రముఖ పర్యాటక కేంద్రం వంజంగి హిల్స్‌కు రూ. రెండు కోట్ల 50 లక్షలతో 3.5 కిలోమీటర్ల తారురోడ్డు మంజూరు చేశామని ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి వి.అభిషేక్ వెల్లడించారు. బుధవారం అధికారులతో కలిసి వంజంగి హిల్స్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వంజంగి నుండి కల్లాల బయలు వరకు తారురోడ్డు నిర్మిస్తున్నామన్నారు. రానున్న ఆరు నెలల్లో రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేయాలని ఇంజనీరింగ్ అధికారుల ఆదేశించారు. పర్యావరణానికి హాని కలవకుండా వ్యూపాయింట్ వద్ద రైలింగ్ నిర్మించాలని సూచించారు. పర్యాటకులకు సౌకర్యవంతంగా ఉండేలా నీటి సదుపాయంతో కంటైనర్ టాయిలెట్లు నిర్మించాలని స్పష్టం చేశారు. నిర్మాణపనుల్లో నాణ్యత పాటించి. నిర్దిష్టమైన గడువులోగా రోడ్డు పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమశాఖ ఇఇ డివిఆర్ఎం రాజు, డిఇఇ. అనుదీప్, ఎంపిడిఒ సాయి నవీన్ తదితరులు పాల్గొన్నారు.

అసాంఘిక శక్తులకు ఆశ్రయం కల్పించకండి


చింతపల్లి సంతలో గిరిజనులతో మాట్లాడుతున్న సిఐ రమేష్, ఎస్ఐ అరుణ్ కిరణ్

ప్రజాశక్తి - చింతపల్లి : మారుమూల గిరి గ్రామాలలోని ప్రజలు అనుమానిత వ్యక్తులు, అసాంఘిక శక్తులకు ఆశ్రయం కల్పించవద్దని చింతపల్లి సీఐ రమేష్, ఎస్సై అరుణ్ కిరణ్ సూచించారు. బుధవారం వివిధ గ్రామాల నుంచి చింతపల్లి వారపు సంతకు వచ్చిన గిరిజనులకు గంజాయి సాగు, క్రయవిక్రయాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అల్లూరి ఏజెన్సీ ప్రాంతంలో గంజాయి సాగు నిర్మూలనకు పోలీస్, ఎక్సైజ్, రెవెన్యూ, అటవీశాఖల అధికారుల సమన్వయంతో పనిచేస్తున్నాయనానరు.మైదాన ప్రాంతాలకు చెందిన కొంతమంది గుర్తు తెలియని వ్యక్తులు, వ్యాపారస్తులు అల్లూరి ఏజెన్సీ ప్రాంత గిరిజనుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకొని మారుమూల గిరి గ్రామాలను గంజాయి, ఇతర మత్త పదార్థాలకు నెలవుగా చేసి, ఆంధ్ర ఒడిశా సరిహద్దు ప్రాంతాల నుంచి గంజాయిని అక్రమంగా రవాణా చేస్తున్నారన్నారు. అటువంటి వారి సమాచారం పోలీస్ శాఖకు చేరవేయాలని సూచించారు. అక్రమ వ్యాపారాలు చేస్తున్న మైదాన ప్రాంత వ్యాపారులకు గిరిజనులు సహాయ సహకారాలు అందిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అదే క్రమంలో గంజాయి రవాణా చేస్తున్న వ్యక్తులపై ప్రత్యేక చట్టంతో కేసులు నమోదు చేసి అరెస్టు చేయక తప్పదని హెచ్చరించారు.కార్యక్రమంలో పోలీస్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం


రక్షణ లేకుండా ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

ప్రజాశక్తి డుంబ్రిగుడ: మండలంలోని అరుకు పంచాయతీ కేంద్రంలో జిసిసి గోదాముకు ఆనుకుని చేతికందే ఎత్తులో ఉన్న విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ప్రమాదం పొంచి ఉంది. నిత్యం రాకపోకలు సాగించే ఈ మార్గంలో అటువైపుగా వెళ్లే గిరిజనులకు ప్రమాదం పొంచి ఉంది. ట్రాన్స్ ఫార్మర్ చుట్టూ కంచె ఏర్పాటు చేయలేదు. 'మూగజీవాలకు, గిరిజనులకు ట్రాన్స్ ఫార్మర్‌తో ఏ క్షణంలో ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ కంచెను ఏర్పాటు చేసి ప్రమాదాల నివారణకు అడ్డుకట్ట వేయాలని స్థానికులు కోరుతున్నారు.

చదువుకోవడానికి.. ఎంత కష్టం.!

● వాగులు, వంకలు దాటి వెళుతున్న గొర్రెలమెట్ట గిరిజన చిన్నారులు
● వెళ్లి వచ్చే క్రమంలో పొంచి ఉన్న ప్రమాదం
● గ్రామంలో పాఠశాల లేకే ఇబ్బందులు
● ప్రత్యామ్నాయ పాఠశాల ఏర్పాటుకు వినతి
● మొరపెట్టుకున్నా పట్టించుకోని పాలకులు


కాలినడకన అడవి మార్గంలో నడిచి వెళుతున్న గిరి బాలలు

ప్రజాశక్తి -ముంచింగిపుట్టు : బడిఈడు పిల్లలందరినీ పాఠశాలల్లో చేర్పించేందుకు విద్యాసంవత్సరం ప్రారంభంలో అనేక ప్రత్యేక కార్యక్రమాలు, చైతన్య సదస్సులు, ర్యాలీలు నిర్వహిస్తూ ప్రభుత్వ యంత్రాంగం, అధికారులు నానా హైరానా పడుతున్న నేటి పరిస్థితుల్లో... తాము చదువు కుంటామంటూ ముందుకొచ్చిన గిరిజన చిన్నారులకు గ్రామంలో బడి లేకపోవడంతో చదువుకోవడానికి పడుతున్న కష్టాలను చూస్తే కడుపు తరుక్కుపోక మానదు. చదువు కోవాలన్న ఆశ చిన్నారుల్లో, చదివించాలన్న ఆకాంక్ష తల్లిదండ్రుల్లో ఉన్నప్పటికీ, ఉన్న ఊరిలో పాఠశాల లేకపోవడంతో సీజన్‌లో ఉధృతంగా పొంగే కొండవాగులు, గెడ్డలు దాటుకుంటూ, దట్టంగా పొదలు కమ్ముకున్న అడవిమార్గంలో పక్క ఊరి పాఠశాలకు వెళ్లివస్తూ నానా ఇబ్బందులు పడుతున్నారు. గ్రామంలో ప్రత్యామ్నాయ పాఠశాల ఏర్పాటు చేయాలని అధికారులు, నేతలకు మొరపెట్టుకున్నా కనీస స్పందన లేకపోవడంతో తమ పిల్లలకు కష్టాలు తప్పడం లేదని తల్లిదండ్రులు ఆవేదన చెందుతున్నారు. మండలంలోని కర్రిముక్కిపుట్టు గ్రామపంచాయతీ గొర్రెల మెట్ట గ్రామంలో 30ఆదివాసీ గిరిజన కటుంబాలుండగా, 15మంది బడిఈడు పిల్లలున్నారు. వీరు చదువుకునేందుకు గ్రామంలో పాఠశాల లేకపోవడంతో రానుపోను సుమారు రెండు కిలోమీటర్లు దూరంలో ఉన్న వెచ్చంగి గ్రామంలోని ప్రాథమిక పాఠశాలకు వెళ్లి వస్తున్నారు. అయితే గొర్రెల మెట్ట నుండి వెచ్చంగి వరకు పక్కఊరిలోని పాఠశాలకు వెళ్లేందుకు ఈ చిన్నారులు రెండు కొండవాగులు దాటి, జీడి తోటల మధ్యగుండా, ఏపుగా పొదలతో భయంకరంగా కమ్ముకుని వున్న అడవిమార్గంలో కాలినడకన వెళ్లక తప్పని దుస్థితి ఉంది. మామూలు రోజుల్లో కాలిబాట అయినా క్లియర్‌గా ఉండే పరిస్థితి ఉన్నా, ప్రస్తుతం వర్షాల సీజన్‌లో గెడ్డలు ఉధృతంగా పొంగి ప్రవహించడంతోపాటు, పచ్చని పొదలు ఏపుగా పెరిగి మార్గం కనిపించే పరిస్థితి ఉండదు. దీంతో అడవి మార్గమధ్యంలో పాఠశాలకు వెళ్లేందుకు చిన్నారులు భయభ్రాంతులకు గురవుతున్నారని వారి


గెడ్డ దాటి వెళుతున్న గొర్రెలపుట్టు గిరిజన చిన్నారులు

తల్లిదండ్రులు చెబుతున్నారు. ఒకటిరెండు రోజులైతే తాము పిల్లలను పాఠశాలకు తీసుకెళ్లి తేగలమని, ఇపుడు పనుల సీజన్ కావడంతో ఇబ్బంది పడే పరిస్థితి ఉందని వాపోతున్నారు. దీంతో ఆ చిన్నారులే ఒకరికొకరు తోడుగా చేయిచేయి పట్టుకుంటూ, పాఠశాలకు వెళ్లి వస్తున్నారు. అయితే అడవి మార్గంలో ఎక్కడ ఎటువంటి విషసర్పాలు, కీటకాలు ఉన్నాయో తెలియక బిక్కుబిక్కుమంటూ వెళుతున్నారని తల్లిదండ్రులు ఆవేదన చెందుతున్నారు. అంతేకాక వర్షాలు కురిస్తే గెడ్డలు పొంగే పరిస్థితి ఉంటుదని, ఈ నేపథ్యంలో రెండు గెడ్డలుదాటి రావాల్సి ఉన్నందున వారు ఇంటికి వచ్చేవరకు భయపడుతూ ఎదురుచూపులు తప్పడం లేదని ఆవేదన చెందున్నారు.

ప్రత్యామ్నాయ పాఠశాల ఏర్పాటు చేయాలి

గొర్రెలమెట్ట గ్రామంలో 15మంది బడిఈడు పిల్లలు ఉండడంతోపాటు వారంతా చదువుకుంటున్న పరిస్థితుల్లో గ్రామంలో ప్రత్యామ్నాయ పాఠశాలను ఏర్పాటు చేసి, విద్యావాలంటీరునైనా నియమించి, ప్రాథమిక తరగతుల వరకైనా గ్రామంలో విద్యాబోధన సాగేల చర్యలు చేపట్టాలని విద్యార్థుల తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు కుటుంబ సభ్యులు గెమ్మెల వెంకటరావు, గెమ్మెల మోహనరావు, కొర్ర మత్స్యరాజు, కొర్ర కేశవరావు, తదితరులు కోరుతున్నారు. జిల్లా కలెక్టర్, ఐటిడిఎ పిఒతోపాటు డిఎంహెచ్ఒ, ఇతర సంబంధిత అధికారులు, గిరిజన ప్రజాప్రతినిధులు దీనిపై దృష్టి సారించాలని వేడుకుంటున్నారు. దీనిపై అధికారులు, నేతలుఎలా స్పందిస్తారో వేచిచూడాలి..


సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర నాయకులు మంతెన సీతారాం

పోలవరం నిర్వాసితుల సమస్యలను పరిష్కరించండి

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం

ప్రజాశక్తి-ఎటపాక

పోలవరం ప్రాజెక్టు నిర్మాణం కంటే ముందుగానే నిర్వాసితుల సమస్యలను పరిష్కరించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మండలంలో కేంద్రంలో సిపిఎం నాయకులు సోందె రామారావు అధ్యక్షతన బుధవారం జరిగిన ఆ పార్టీ మండల కమిటీ సమావేశంలో సీతారాం ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సోమవారం పోలవరంలో పర్యటించి ప్రాజెక్టు నిర్మాణంపై రోజంతా సమీక్ష చేశారే గాని, ఈ ప్రాజెక్టు వల్ల నిర్వాసితులవుతున్న ఒక లక్షా 6 వేల కుటుంబాలకు నష్టపరిహారం, పునరావాసం గురించి చర్చించకపోవడం బాధాకరమన్నారు. ప్రాజెక్టు నిర్మాణ సమస్యలకు ఎంత ప్రాధాన్యత ఉన్నదో అంతకన్నా ఎక్కువగా నిర్వాసితుల సమస్యలు ఉన్నాయన్నది కొత్త ప్రభుత్వం గుర్తించాలని విజ్ఞప్తి చేశారు. జులై, ఆగస్టు నెలలో వచ్చే అధిక వర్షాలకు 300 గ్రామాలు నీట మునిగిపోతాయని, ప్రభుత్వం ముందస్తు సహాయక చర్యలు యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని కోరారు. పోలవరం ప్రాజెక్టు పరిధిలో ఉన్న పది మండలాల్లో నిర్వాసితుల ప్రస్తుత పరిస్థితుల మీద ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలని, నిర్వాసితుల పునరావాసానికి అత్యంత ప్రాధాన్యత ఇచ్చి చిత్తశుద్ధితో సమస్యలను పరిష్కరించాలని కోరారు. 2013 భూ సేకరణ చట్టం ప్రకారం భూమికి భూమి నష్టపరిహారం, మౌలిక వసతులు కల్పించాలన్నారు. తప్పులతడకగా ఉన్న కాంటూర్ లెక్కలతో కాకుండా ఆధునిక పరికరాల సహాయంతో మళ్లీ సమగ్ర సర్వే చేసి ముంపు గ్రామాలను గుర్తించాలని హితవు పలికారు. ఈ సమావేశంలో సిపిఎం రంపచోడవరం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మర్లపాటి నాగేశ్వరరావు, మండల కార్యదర్శి ఐవి, మండల కమిటీ సభ్యులు కాకా అర్జున్, పులుసు బాలకృష్ణ, సోయం వీరమ్మ, పొడియం రత్తమ్మ, పద్మ పాల్గొన్నారు.

ఎజె.రమేష్‌కు మంతెన సీతారాం పరామర్శ

ఇటీవల అనారోగ్యానికి గురైన సిపిఎం తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యులు ఏజె.రమేష్‌ను భద్రాచలంలోని ఆయన నివాసంలో సిపిఎం ఎపి రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం బుధవారం పరామర్శించారు. రమేష్ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకొని మళ్ళీ ప్రజా ఉద్యమాల్లో చురుగ్గా పాల్గొనాలని ఆకాంక్షించారు. ఆయన వెంట సిపిఎం ఎటపాక మండల కార్యదర్శి ఐవి, నాయకులు పి.బాలకృష్ణ, ఐ.పద్మ ఉన్నారు.

గుండెపోటుతో సీనియర్ పాత్రికేయుడు మృతి

ప్రజాశక్తి కొయ్యూరు : కొయ్యూరు మండలానికి చెందిన సీనియర్ పాత్రికేయుడు సాగిరాజు నగేష్ బుధవారం ఆకస్మికంగా గుండెపోటుతో మృతి చెందారు. రెండు రోజుల నుంచి అనారోగ్యంతో బాధపడుతున్న నగేష్ బుధవారం ఉదయం ఒక్కసారిగా కిందపడి మృతి చెందారని కుటుంబ సభ్యులు తెలిపారు. నగేష్ మృతికి మండలంలోని ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు, పలువురు అధికారులు, ఏపీయూడబ్ల్యూజేఎఫ్ ఉమ్మడి విశాఖ జిల్లా అధ్యక్షుడు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు.

వరదలపై అధికారులు అప్రమత్తంగా ఉండాలి

అల్లూరి జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్


సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న అల్లూరి జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్


ప్రజాశక్తి-చింతూరు

రానున్న వరదల సమయంలో అధికారులందరూ అందుబాటులో ఉండి వరద సహాయక చర్యలు చేపట్టడానికి సిద్ధంగా ఉండాలని అల్లూరి జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ ఆదేశించారు. వరద సహాయక కార్యక్రమాలపై చింతూరు ఐటిడిఎ కార్యాలయంలో బుదవారం ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. ముంపు ప్రాంతాల్లో ముందుగానే బఫర్ స్టాక్ ఏర్పాటు చేయాలని, పడవలను అందుబాటులో ఉంచాలని సూచించారు. వరదల కారణంగా తాగునీరు కలుషితమవుతుందని, రక్షిత తాగునీరు ప్రజలకు అందజేయాలని ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులను ఆదేశించారు. రహదారులు మూసుకుపోతున్న గ్రామాలకు ప్రత్యామ్నాయ దారులు ఏర్పాటు చేయాలన్నారు. ముంపు ప్రాంతాల్లో పేరుకు పోయే బురదను వాటర్ ప్రెసర్ ద్వారా శుభ్రం చేసేందుకు ఫైర్ డిపార్ట్మెంట్ సిద్ధంగా ఉండాలని కోరారు.

సమావేశంలో పాల్గొన్న ప్రజా ప్రతినిధులు మాట్లాడుతూ వరదల కాలంలో ముంపు బాధితులకు ముందుగానే బఫర్ స్టాక్‌తో పాటు దోమతెరలు, మందులు, నిత్యావసర వస్తువులు, సోలార్ లైట్లు, తాగునీర అందజేయాలని కోరారు. దీనికి సానుకూలంగా కలెక్టర్ స్పందించి తప్పని సరిగా ప్రభుత్వంతో మాట్లాడి ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. సిపిఎం నాయకులు, శ్రీరామగిరి సర్పంచ్ పులి సంతోష్ మాట్లాడుతూ వరదల సమయంలో తమ పంచాయితీలో సహాయక కార్యక్రమాలు, నిత్యావసర వస్తువులు సరిగా అందటం లేదని పేర్కొన్నారు. బాలింతలు, వ్యాధిగ్రస్తులు, వృద్ధులు ఇబ్బందులు పడుతున్నారని, వారిని దృష్టిలో పెట్టుకొని వారిని ముందుగానే పునరావాస కేంద్రాలకు తరలించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రంపచోడవరం ఎమ్మెల్యే శిరీషాదేవి, చింతూరు, రంపచోడవరం ఐటిడిఎ పిఒలు కావూరి చైతన్య, సూరజ్ గనోరే, సబ్ కలెక్టర్ ప్రశాంత్‌కుమార్, ఒఎస్‌డి మహేశ్వరరెడ్డి, నాలుగు మండలాల అధికారులు, వివిధ రాజకీయ నాయకులు పాల్గొన్నారు.

మౌలిక వసతులు కల్పించాలి

కలెక్టర్‌కు సిపిఎం ప్రజాప్రతినిధులు, నేతలు వినతి


కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న సిపిఎం ప్రజాప్రతినిధులు

ప్రజాశక్తి-విఆర్.పురం, కూనవరం, చింతూరు

వరద సహాయక కార్యక్రమాలపై చింతూరు ఐటిడిఎ కార్యాలయంలో బుదవారం కలెక్టర్ దినేష్‌కుమార్ నిర్వహించిన సమీక్షా సమావేశంలో పాల్గొన్న విఆర్.పురం, కూనవరం, చింతూరు మండలాలకు చెందిన సిపిఎం ప్రజాప్రతినిధులు, నాయకులు ఆయా మండలాల్లో నెలకొన్న సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు.

విఆర్.పురం మండలం ములకనపల్లి, రామవరం, రేఖపల్లి, పెదమట్టపల్లి పంచాయితీల పరిధిలోని గ్రామాలకు సిసి రోడ్లు మంజూరు చేయాలని, పెద్దమట్టపల్లి నుంచి నర్సింగపేట వరకు తవ్వి వదిలేసిన రోడ్డును పూర్తి చేయాలని విఆర్.పురం ఎంపీపీ కారం లక్ష్మి కోరారు. శ్రీరామగిరి, జీడిగుప్ప, తుమ్మిలేరు పంచాయితీల్లో పోలవరం నిర్వాసితులకు ఆర్ అండ్ ఆర్, భూమికి భూమి, భూ నష్టపరిహారం పెండింగ్‌లో ఉందని, ఆ సమస్యలను పరిష్కరించాలని కోరారు. వరదల సమయంలో విద్యుత్ అంతరాయం లేకుండా చింతూరు నుంచి రామన్నపాలెం మీదుగా పెదమట్టపల్లి వరకు 33 కెవి లైన్ ఏర్పాటు చేయాలని, చింతూరు నుంచి కన్నూలూరు మీదుగా కుందులూరు వరకు రహదారి మంజూరు చేయాలని కోరారు. జిల్లా కలెక్టర్‌ను కలిసిన వారిలో సర్పంచులు పులి సంతోష్ కుమార్, సవలం మారయ్య, పూనం సరోజిని, వెట్టి లక్ష్మి, కారం బుచ్చమ్మ, ఎంపీటీసీ ప్రదీప్ కుమార్ సిపిఎం నాయకులు పూనం సత్యనారాయణ, సోయం చినబాబు, కారం సుందరయ్య, గుండిపూడి లక్ష్మణరావు, శ్రీరపు తాతబాబు ఉన్నారు.

కూనవరం మండలం కోతులగుట్ట నుండి ఏడుగురాళ్ళపల్లి వరకు, బోదునూరు నుండి చిన్న ఆర్కూర్ వరకు రోడ్లు నిర్మించాలని, పెద్దర్కూర్ పంచాయితీ గండి కొత్తగూడెం బిటి రోడ్డు, నిర్వాసిత గ్రామాల్లో సిసి రోడ్లు వేయాలని వైస్ ఎంపిపి కొమరం పెంటయ్య కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. రేపాకలో జల్ జీవన్ మిషన్ ట్యాంక్ నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయాలని, లింగాపురం రేగులపాడు గ్రామాల మధ్య వంతెనను పునరుద్ధరించాలని కోరారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో ఎంపీటీసీ అమ్మాజీ, సర్పంచ్ నాగమణి, బొగ్గా వెంకమ్మ ఉన్నారు.


చింతూరు మండల కేంద్రంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవనాల నిర్మాణం పూర్తి చేయాలని, ఏరియా హాస్పిటల్‌లో ఖాళీగా ఉన్న స్పెషలిస్ట్ వైద్యుల పోస్టులను భర్తీ చేయాలని, రోగులకు సరిపడా అదనపు గదులను నియమించాలని, మెరుగైన వైద్య సేవలు అందించాలని, సోకులేరు, చంద్రవంక, సీలేరు నదులపై లిఫ్ట్ ఇరిగేషన్ ఏర్పాటు చేసి రైతులకు సాగునీరు అందించాలని కోరారు. ఏడుగురాళ్లపల్లి నుండి మల్లంపేట వరకు, ఏడుగురాళ్లపల్లి నుండి కోతులు గుట్ట వరకు, అల్లిగూడెం నుండి డి.జగ్గరం వరకు బీటీ రోడ్లు, కల్లేరు నుండి మధుగురు వరకు రింగ్ రోడ్డు ఏర్పాటు చేయాలని, జల్ జీవన్ మిషన్ పనులు త్వరితగతిన పూర్తి చేసి తాగునీరు అందించాలని కోరారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో సిపిఎం నాయకులు సీసం సురేష్, పల్లపు వెంకట్, యర్రంశెట్టి శ్రీనివాస్, కారం, సుబ్బారావు ఉన్నారు.

ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి : సిఐటియు

చింతూరు : గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలల్లో ఔట్ సోర్సింగ్ పద్ధతిలో పని చేస్తున్న వర్కర్లకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా వర్కర్ల పోస్టులు భర్తీ చేయాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని సిఐటియు రంపచోడవరం జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లపు వెంకట్, నాయకులు వీరయ్య బుధవారం జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్‌కు చింతూరులో వినతిపత్రం అందజేశారు. ఐదు సంవత్సరాలు పూర్తి చేసుకున్న వారికి సర్వీస్ క్రమబద్ధీకరించాలని, మొదటి కేటగిరి వేతనాలు అమలు చేయాలని, విధినిర్వహణలో చనిపోయిన వారి కుటుంబాలకు పరిహారం అందించాలని, హెచ్ఆర్, ఈఎస్ఐ అమలు చేయాలని కోరారు.

గిరిజన గ్రామాల అభివృద్ధికి చర్యలు

కనెక్టివిటీపై ప్రత్యేక దృష్టి : అల్లూరి జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్


కలెక్టర్‌కి వినతి పత్రం ఇస్తున్న పార్వతీనగర్ గిరిజనులు

ప్రజాశక్తి -సీలేరు

అల్లూరి సీతా రామరాజు జిల్లాలో కనెక్టివిటీ సమస్య అధికంగా ఉందని, దీనిపై ప్రత్యేక దృష్టి సారించి, మారుమూల గిరిజన గ్రామాల అభివృద్ధికి చర్యలు చేపడతామని కలెక్టర్ దినేష్ కుమార్ వెల్లడించారు. జిల్లా కలెక్టర్‌గా ఇటీవల నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఆయన జీకే వీధి మండలం సీలేరులో బుధవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఏపీ జెన్కో అతిథి గృహంలో ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. ప్రస్తుతం జిల్లాలో 938 మారుమూల ప్రాంతాలకు కనెక్టివిటీ లేదని, దీనికోసం గత కలెక్టర్ సుమిత్ కుమార్ దృష్టి పెట్టి చాలా పనులు ప్రారంభించారని, అందులో పెండింగ్లో ఉన్న పనున్నీ పూర్తి చేస్తామని చెప్పారు. ఇందులో కోసం మంజూరైన నిధులతో పాటు ప్రత్యేక జనరల్ నిధులు కోసం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. మొబైల్ యాక్టివిటీ కూడా సరి చేయడానికి జియో, ఎయిర్‌టెల్ అధికారులతో మాట్లాడి మారుమూల ప్రాంతాలకు సేవలు అందించేలా చర్యలు చేపడతామని వెల్లడించారు. ఏజెన్సీలో మలేరియా ప్రబలకుండా అన్ని చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. జిల్లాలోని రెసిడెన్షియల్ పాఠశాలకు ఎక్కువ డిమాండ్ ఉందని, వీట్లో సీట్లు పెంచాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించామని తెలిపారు. వర్షాకాల సీజన్‌లో వరదల నివారణపై అన్ని శాఖల అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఎపి జెన్కో అధికారులతో సమావేశమై సీలేరులో నూతనంగా నెలకొల్పుబోయే పంపు స్టోరేజ్ ప్రాజెక్టు విధి విధానాలపై చర్చించినట్లు కలెక్టర్ దినేష్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సీలేరు కాంప్లెక్స్ ఎస్ఇ కెకెవి.ప్రశాంత్ కుమార్, పంపు స్టోరేజ్ ప్రాజెక్టు ఎస్ఈ చంద్రశేఖర్‌రెడ్డి, ఈఈ ప్రభాకర్, డిఈఈ వెంకట మధు, ఏఈ సురేష్, జీకే.వీధి తహశీల్దారు ప్రసాద్, ఎంపీడీవో ఉమామహేశ్వరరావు, సీలేరు పంచాయతీ కార్యదర్శి వాసం శ్రీనివాస్, సర్పంచ్ దుర్గ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిఐటియు జిల్లా అధ్యక్షులు చిన్నయ్య పడాల్

10న డిమాండ్స్‌డేను జయప్రదం చేయండి

సిఐటియు అల్లూరి జిల్లా అధ్యక్షులు చిన్నయ్య పడాల్

ప్రజాశక్తి - చింతపల్లి : కేంద్రంలోని మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతాంగ, ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా, వాటిని తిప్పికొట్టేందుకు ఈనెల 10న దేశవ్యాప్తంగా జరుగుతున్న డిమాండ్స్ డేను జయప్రదం చేయాలని సిఐటియు అల్లూరి జిల్లా అధ్యక్షుడు బోనంగి చిన్నయ్య పడాల్ విజ్ఞప్తి చేశారు. మండల కేంద్రాలలో నిరసన ప్రదర్శనలో సిఐటియు అనుబంధ కార్మిక సంఘాలన్నీ పాల్గొనాలని పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక సిఐటియు కార్యాలయంలో యూనియన్ జిల్లా అధ్యక్షురాలు పసుపులేటి లక్ష్మీ అధ్యక్షతన మధ్యాహ్న భోజన కార్మికుల సమావేశంలో మాట్లాడుతూ, కేంద్రంలో మూడవసారి అధికారం చేపట్టిన మోడీ నాయకత్వం లోని బిజెపి సంకీర్ణ ప్రభుత్వం కార్మిక వర్గ హక్కులను కాలరాసే లేబర్ కోడ్స్ అమలుకు చేస్తున్న ప్రయత్నాలను తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. మోడీ నాయకత్వంలోని బిజెపి ప్రభుత్వం అధికారంలోకి రాగానే కార్పొరేట్ సంస్థలకు మేలు చేసే విధంగా ప్రావిడెంట్ ఫండ్ చట్టంలో పెనాల్టీని తగ్గించి కార్మికులకు అన్యాయం చేసిందని విమర్శించారు. బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రైవేటీకరణ విధానాల వల్లే రైల్వే రంగంలో ప్రమాదాలు జరుగుతున్నాయని, విమానాశ్రయాలకు భద్రత లేకుండా పోతుందన్నారు. ఆరుగాలం కష్టించి పంటలు పండించే రైతన్నలకు స్వామినాథన్ సిఫార్సులకు అనుగుణంగా కనీస మద్దతు ధర దక్కడం లేదన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలలో పనిచేస్తున్న స్కీమ్ వర్కర్స్‌ను కార్మికులుగా గుర్తించి కనీస వేతనాలు అమలు చేయడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని దుయ్యబట్టారు. సమావేశంలో సిఐటియు, మండల అధ్యక్ష కార్యదర్శులు కే పద్మ, మినుముల జ్యోతి, లక్ష్మి, దేవుడమ్మ, పార్వతమ్మ, కార్మికులు పాల్గొన్నారు.

విద్యార్థులకు హిమోగ్లోబిన్ పరీక్షలు

ప్రజాశక్తి -డుంబ్రిగుడ: గిరిజన విద్యార్థులకు హిమోగ్లోబిన్ పరీక్షలను వైద్య సిబ్బంది నిర్వహిస్తున్నారు. మండలంలోని గిరిజన ఆశ్రమ పాఠశాలలతోపాటు కేజీబీవీలో హిమోగ్లోబిన్ పరీక్షలను వైద్య సిబ్బంది బృందాలుగా విడిపోయి పరీక్షలను నిర్వహిస్తున్నారు. గిరిజన విద్యార్థుల్లో రక్తహీనత నివారణలో భాగంగా హిమోగ్లోబిన్ పరీక్షలను నిర్వహించేందుకు చర్యలు చేపట్టామని వైద్యాధికారి రాంబాబు తెలిపారు. రక్త పరీక్షల్లో రక్తహీనతగా ఉన్నట్లు గుర్తిస్తే, అటువంటి విద్యార్థులపై ప్రత్యేక చొరవ చూపించి ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలను నిర్వహించి ప్రభుత్వం అందించే ఉచిత మందులతోపాటు రక్తహీనత నివారణకు చర్యలు తీసుకుంటామన్నారు. పాఠశాలల యాజమాన్యం రక్తహీనత ఉన్న విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించి వారు పూర్తిగా ఆరోగ్యవంతులుగా ఉండేలా చూసుకుంటూ మందులు వాడేలా చూడాలనికోరారు. ఎంపిహెచ్ఇఒ శౌరీ, హెల్త్ సూపర్వైజర్ రామారావు, హెల్త్ అసిస్టెంట్ స్వామి, ఆశా



విద్యుత్ సౌకర్యం కల్పించాలని

కాగడాలతో వినూత్న నిరసన

ప్రజాశక్తి -అనంతగిరి : విద్యుత్ సౌకర్యం కల్పించాలని కోరుతూ మండలంలోని మారుమూల నాన్‌షెడ్యూల్ రొంపిలి పంచాయతీ బూరిగ, చిన్నకోన్నల గ్రామాల ఆదివాసీ గిరిజనులు మంగళవారం అర్ధరాత్రి కాగడలతో వినూత్న నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వార్డు సభ్యులు సోమ్మెల అప్పలరాజు మాట్లాడుతూ రెండు గ్రామాల్లో 230 మంది జనాభా ఉన్నప్పటికీ, తమ గ్రామాలకు కనీస విద్యుత్ సౌకర్యం లేదని ఆవేదన చెందుతున్నారు. 2017లో సౌరవిద్యుత్ యూనిట్ ఏర్పాటు చేసినప్పటికీ, అది ఎన్నాళ్లో పనిచేయలేదన్నారు,. దీనిపై సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందించలేదన్నారు. దీంతో అడవుల్లో, కొండకోనల మధ్య ఉన్న తమ గ్రామాలు పొద్దుగుంకితేచాలు అంధకారం అలుముకుని అవస్థలు పడే పరిస్థితి ఉందన్నారు. విషజంతువులు, కీటకాలు, పాముల సంచారంతో రాత్రివేళ అడుగుబయట పెట్టాలన్నా, ఇంట్లో దేనైన్నా పట్టుకోవాలన్నా భయపడే పరిస్థితి ఉందనివాపోతున్నారు. తమ గ్రామాల్లోకి క్రూరజంతువులు ప్రవేశించి, పశువులు, మేకలను చంపి తినేసిన సందర్భాలు కూడా ఉన్నాయని, దీంతో ఎప్పుడు ఏం జరుగుతుందన్న భయంతో బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నామని ఆవేదన చెందుతున్నారు. పలుమార్లు విశాఖలోని ఎపిఇపిడిసిఎల్ సిఎండి, ఇతర అధికారులను కలిసి లిఖితపూర్వకంగా విన్నవించామని, అయినా



కాగడాలతో నిరసన తెలుపుతున్న గిరిజనులు

ఎటువంటి స్పందన లేదన్నారు. గత ప్రభుత్వహయాంలో నేతలకు, అధికారులకు విన్నవించినా కంఠశోషే తప్ప పనులు జరగలేదన్నారు, కూటమి ప్రభుత్వమైన బూరిగ, చిన్నకొన్నల గ్రామస్తుల కష్టాలను గుర్తించి, విద్యుత్ సౌకర్యాన్ని కల్పించాలని గ్రామస్తులు కొత్తమ్మ , సింహాచలం, తదితరులు వేడుకుంటున్నారు.

ఫీడర్ అంబులెన్స్ డ్రైవర్లకు

కనీస వేతనాలు చెల్లించాలి : సిఐటియు



మాట్లాడుతున్న సిఐటియు నేత ఉమామహేశ్వరరావు

ప్రజాశక్తి- అరకులోయ రూరల్: గిరిజన ప్రాంతంలో మారుమూల రోడ్డు సౌకర్యం లేని గ్రామాల్లో అత్యవసర పరిస్థితులు, ప్రాణాపాయంలో ఉన్న రోగులను ఆసుపత్రికి తరలించేందుకు ఏర్పాటు చేసినా ఫీడర్ అంబులెన్స్ డ్రైవర్లకు కనీస వేతనాలు చెల్లించి, ఇతర సౌకర్యాలను కల్పించాలని ఆగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వి ఉమామహేశ్వరరావు డిమాండ్ చేశారు.. బుధవారం అరకులోయ ఆదివాసీ గిరిజన సంఘం భవనంలో ఉద్యోగుల జిల్లా కార్యవర్గ సమావేశంలో మాట్లాడుతూ, 2018లో ఏర్పాటైన ఫీడర్ అంబులెన్స్ వ్యవస్థలో భాగంగా పాడేరు ఐటిడిఏ పరిధిలో 42 అంబులెన్స్‌లు ఉన్నాయని, అయితే ఐదారేళ్లయినా వీరికి కనీస వేతనాలు, ఇతర సౌకర్యాలు కల్పించడం లేదన్నారు. వీరికి పనిభారం ఎక్కువున్నా కనీస వేతనం ఇవ్వడం లేదని, తక్షణమే వీరికి ఉద్యోగభద్రత కల్పించడంలోపాటు, రూ.26వేలు నెలసరి కనీస వేతనం, ఇతర సౌకర్యాలను కల్పించాలని డిమాండ్ చేశారు వీటి నిర్వహణకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం చేసుకున్న జివికె యాజమాన్యం వీరి ఇబ్బందులు సమస్యలను పట్టించుకోవడం లేదన్నారు.అంబులెన్స్‌లకు రిపేర్లు వచ్చినా ఆ సంస్థ పట్టించుకోకపోవడంతో సొంత డబ్బులతో మరమ్మతులు చేయించుకుంటున్నారన్నారు సమస్యలపై జివికె యాజమాన్యాన్ని ప్రశ్నిస్తే అనుచితంగా, నిర్లక్ష్యంగా ప్రవర్తిస్తున్నారని ఆరోపించారు. అదీ చాలదన్నట్లు ఇచ్చిన అరకొర జీతంలోనే కోత విధిస్తున్నారని మండిపడ్డారు.ఇ ప్పటికైనా గిరిజన సంక్షేమం, వైద్యఆరోగ్యశాఖల మంత్రులు కలుగజేసుకుని తమ సమస్యలను పరిష్కరించాలని వీరు వేడుకుంటున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు శ్రీనివాస్ యూనియన్ జిల్లా అధ్యక్షులు శంకర్రావు, కార్యదర్శి హేమంత్, నాయకులు గోవిందు, కామేష్, శ్రీనివాస్, మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

జిఒ 117ను రద్దు చేయాలి

ప్రజాశక్తి - చింతపల్లి :- ప్రభుత్వ పాఠశాలలను వీలినం చేసే జిఒ117ను వెంటనే రద్దు చేయాలని ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ డిమాండ్ చేశారు. బుధవారం అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంక్షేమ సంఘం భవనంలో ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ అల్లూరి జిల్లా అధ్యక్షులు రావుల జగన్మోహన్ అధ్యక్షతన ఉపాధ్యాయుల అత్యవసర సమావేశం ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన రఘువర్మ మాట్లాడుతూ ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. జిఒ 117 అమలు చేయడంతో 4,5 తరగతులను గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలలో వీలినం చేయడం వలన విద్యార్థిని, విద్యార్థులు పాఠశాలలకు వెళ్లేందుకు సుమారు ఐదు నుంచి పది కిలోమీటర్ల దూరం వెళ్ళవలసిన దుస్థితి ఏర్పడిందన్నారు. అదే క్రమంలో మన్య ప్రాంతంలో ఉపాధ్యాయ పోస్టులు తగ్గించి గిరిజన ఉపాధ్యాయులను మైదాన ప్రాంతానికి తరలించారన్నారు. కూటమి ప్రభుత్వం జిఒ117 ను వెంటనే రద్దుచేసి, మైదాన ప్రాంతానికి వెళ్లిన ఉపాధ్యాయులను గిరిజన ప్రాంతంలో తిరిగి రప్పించాలని కోరారు. అలాగే వైసిపి ప్రభుత్వ హయాంలో రద్దయిన జిఒ3 పునరుద్ధరణకు చర్యలు చేపట్టాలని, మెగా డిఎస్‌సిలో ఏజెన్సీలో శతశాతం ఉపాధ్యాయ పోస్టులను నిరుద్యోగ గిరిజన అభ్యర్థులతో భర్తీ చేయాలని కోరారు. సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయుల సర్వీస్ రూల్స్ సమస్యను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు దేపూరు శశికుమార్, జోనల్ కార్యదర్శి బౌడు గంగరాజు, ఎపిటిఎఫ్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కాకర చంద్రావు, కె మహేష్ బాబు, జి కామేష్, జీకే వీధి మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కే పెద్దబ్బాయి, రెడ్డి వెంకటేశ్వర్లు పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

ఆస్తి కోసం అన్నను చంపిన తమ్ముళ్లు

- యలమంచిలిలో ఘటన

ప్రజాశక్తి - ఎస్.రాయవరం : ఆస్తి కోసం పెద్దనాన్న కుమారుడైన అన్ననే హతమార్చి, పూడ్చిపెట్టిన దారుణ ఘటన ఎలమంచిలిలో సంచలనం రేపింది. మృతుడి కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాలివి. మండలంలోని యలమంచిలి గ్రామం భవనం వీధికి చెందిన సున్నం సతీష్ (45) బంగారం వ్యాపారి. గత నెల 27న శుక్రవారం రాత్రి సున్నం సతీష్ పినతండ్రి కొడుకులైన సున్నం మనోజ్, దేవుపల్లి రాజేష్‌లు తన పెదనాన్న కుమారుడైన సున్నం సతీష్ ఇంటికి వచ్చి అతనిపై దాడి చేసి హతమార్చారన్నారు. మృతదేహాన్ని శనివారం ఉదయం యస్ రాయవరం మండలం దార్లపూడి గ్రామం వద్ద పోలవరం కాలువ ఫిల్లర్ వద్ద పూడ్చి పెట్టారన్నారు. మృతుడి సతీష్ ఆచూకి తెలియకపోవడంతో కుటుంబీకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు తమదైన రీతిలో అనుమానితులను ప్రశ్నించగా, నిందితులు తమ తప్పును ఒప్పుకుని, తాము మృతదేహాన్ని పాతిపెట్టిన ప్రదేశాన్ని పోలీసులకు చూపించారు. బుధవారం మధ్యాహ్నం మృతదేహాన్ని వెలికి తీసిన పోలీసులు, స్థానిక తహశీల్దారు జయలక్ష్మి సమక్షంలో పంచనామా నిర్వహించి, పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. యలమంచిలి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అప్పన్నను దర్శించుకున్న ప్రముఖులు

ప్రజాశక్తి- సింహాచలం : సింహాద్రి అప్పన్నను బుధవారం గాజువాక ఎమ్మెల్యే, టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు, విశాఖపట్నం కలెక్టర్ ఎంఎన్.హరీంద్రప్రసాద్ దంపతులు వేర్వేరుగా దర్శించుకున్నారు. వీరికి ఆలయ కార్యనిర్వహణాధికారి శ్రీనివాసమూర్తి స్వాగతం పలికారు. వారు ముందుగా కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. తదుపరి బేడా మండపం ప్రదక్షిణ చేశారు. అనంతరం స్వామి అంతరాలయంలోనూ, గోదాదేవి సన్నిధిలోను గోత్రనామాలతో ప్రత్యేక పూజలు చేశారు. దర్శనం అనంతరం స్వామివారి శేష వస్త్రంతో సత్కరించారు. ఈఓ శ్రీనివాసమూర్తి స్వామి ప్రసాదాలను అందజేశారు. వీరితో విశాఖపట్నం, భీమిలి ఆర్‌డిఒలు, చినగదిలి తహశీల్దార్ ఉన్నారు.

చెత్త తరలింపు వాహనం ప్రారంభం

ప్రజాశక్తి- గాజువాక : జివిఎంసి జోన్-6 పరిధిలో చెత్త తరలింపునకు ఏర్పాటు చేసిన కొత్త వాహనాన్ని (టిప్పర్) ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు జోనల్ కార్యాలయం వద్ద బుధవారం ప్రారంభించారు. జోనల్ కమిషనర్ బంటు సన్యాసినాయుడు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ, నియోజకవర్గ పరిధిలో శుభ్రతకు పెద్దపీట వేయాలన్నారు. ఆరోగ్య సమాజ స్థాపనలో అందరూ భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జోనల్ పరిధిలోని కార్పొరేటర్లు, అధికారులు పాల్గొన్నారు.

మానం ఆంజనేయనగర్‌లో రెవెన్యూ సర్వే

ప్రజాశక్తి-మధురవాడ : జివిఎంసి 7వ వార్డు పరిధిలోని మానం ఆంజనేయనగర్‌లో రెవెన్యూ అధికారులు బుధవారం ఇంటింటి సర్వే చేశారు. ఈ కాలనీలో నకిలీ పట్టాలతో పలువురు ఇళ్లు నిర్మించుకున్నారని కార్పొరేటర్ పిళ్లా మంగమ్మ, టిడిపి రాష్ట్ర వాణిజ్యవిభాగం కార్యనిర్వాహక కార్య దర్శి పిళ్లా వెంకటరావు విలేకర్ల సమావేశంలో ఆరోపించడంతో రెవెన్యూ యంత్రాంగం స్పందించి చినగదిలి మండలం రీసర్వే డిప్యూటీ తహశీల్దార్ గోవింద్, పద్మనాభం మండల డిప్యూటీ తహశీల్దార్ కిశోర్, ఆర్‌డిఒ కార్యాలయం డిప్యూటీ తహశీల్దార్ సంజీవరావు మూడు బృందాలుగా ఏర్పడి సర్వే చేపట్టారు. మధురవాడ సర్వే నంబర్లు 125/పి, 126/2 లో అప్పటి ఎమ్మెల్యేలు మానం ఆంజనేయులు, పల్లా సింహాచలం 325 పట్టాలను పేదలకు ఇప్పించారు. 1998లో ఆ స్థలం ఎత్తుపల్లాలు, గోతులుగా ఉండడంతో కొందరు ఇళ్లు నిర్మించుకోలేదు. కాలక్రమంలో కొందరు ఇంటి స్థలాలను విక్రయించి వెళ్లిపోయారు. కార్పొరేటర్ ఆరోపణలతో బుధవారం అధికారులు ఇంటింటి సర్వే ప్రారంభించారు. ప్రతి ఇంటికీ వెళ్లి ఒక ప్రొఫార్మా అందించి వివరాలు సేకరించారు. పట్టా ఎప్పుడు ఇచ్చారు, లబ్ధిదారుని పేరు, ఆధార్ నెంబరు, పట్టానెంబర్, విద్యుత్ కనెక్షన్ నెంబరు, ఒకవేళ లబ్ధిదారుని నుంచి పట్టా కొనుగోలు చేస్తే ప్రస్తుత లబ్ధిదారుని వివరాలు, అమ్మిన వ్యక్తి వివరాలు సేకరిస్తున్నారు. సర్వేల్లో తెలిసిన వాస్తవ వివరాలు మేరకు నివేదిక తయారుచేసి ఉన్నతాధికారులకు అందిస్తామని సర్వే చేసిన అధికారులు తెలిపారు.

ఉత్సాహంగా.. ఉత్తేజంగా..

- మన్యం వీరుడు అల్లూరిపై ఆకట్టుకున్న కళా ప్రదర్శనలు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : అల్లూరి విజ్ఞాన కేంద్రం, గురజాడ సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో మూడు రోజులపాటు విశాఖలోని అల్లూరి విజ్ఞాన కేంద్రంలో తలపెట్టిన అల్లూరి సీతారామరాజు జయంతోత్సవాలు రెండో రోజైన బుధవారమూ స్ఫూర్తిదాయకంగా సాగాయి. చిన్నారులు, కళాకారుల సాంస్కృతిక ప్రదర్శనలు ఉత్సాహం, ఉత్తేజం నింపాయి. నగర పరిధిలోని 30 స్కూళ్లు, డ్యాన్స్ స్కూళ్ల నుంచి సుమారు 400 మంది కళాకారులు పాల్గొని ప్రదర్శనలు ఇచ్చారు. అల్లూరి సీతారామరాజుపై అధిక భాగం ఈ ప్రదర్శనలు సాగాయి. వెస్ట్రన్ డ్యాన్స్ కార్యక్రమాల్లో కూడా అల్లూరి సీతారామరాజు గురించి ఆధునిక పద్ధతిలో ప్రదర్శనలు ఇస్తూ కళాకారులు ఆకట్టుకున్నారు. కోలాటాలు నిర్వహించారు. ఏకపాత్రాభినయాలు వేశారు. కామెడీ స్కిట్స్ ప్రదర్శించారు. కళారూపాలన్నింటికీ చప్పట్ల వర్షం కురిసింది. కళా ప్రదర్శనలను మాజీ కార్పొరేటర్ జివి.రవిరాజు, ఆంధ్ర యూనివర్సిటీ ఫైన్ ఆర్ట్స్ ప్రొఫెసర్ నరసింహారావు, దూరదర్శన్ ప్రతినిధి పల్లా ఆనంద్, రచయిత, దర్శకుడు కొరిటాల ప్రభాకర్ ప్రారంభించారు. కార్యక్రమాలు ఏర్పాటు చేసిన నిర్వాహకులను వారు అభినందించారు. ఉదయం 10:30 గంటలకు ప్రారంభమైన ప్రదర్శనలు రాత్రి 7 గంటల వరకు సాగాయి. కార్యక్రమాల నిర్వాహకులు దండు నాగేశ్వరరావు, వై.ఎల్లాజీ, ఆర్ఎస్ఆర్.మూర్తి, వై.అప్పారావు, పివి.రమణ, సిహెచ్.భాస్కర్, పి.మోహనరావు, హేమ తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రాల్లో తనిఖీలు

ప్రజాశక్తి-కొయ్యూరు : మండలంలోని కంతారం, కన్నంపేట, బొర్రంపేట, కర్ణికపాలెం గ్రామాల్లో ఉన్న అంగన్వాడీ కేంద్రాలను మంగళవారం ఐసీడీఎస్ సీడీపీవో విజయకుమారి సందర్శించారు. ముందుగా ఆయా కేంద్రాల్లోని రికార్డులను తనిఖీ చేసి పరిశీలించారు. అంగన్వాడీల ద్వారా అందుతున్న సేవలను గురించి అడిగి తెలుసుకున్నారు. అంగన్వాడీ సిబ్బంది సక్రమంగా విధులు నిర్వహించాలన్నారు. ప్రీ స్కూల్ పిల్లలకు టీవీ ద్వారా పద్యాలు, పాఠాలు బోధించాలని సూచించారు.

'ఎమ్మెల్సీ పదవి ఇవ్వాలి'

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : జివిఎంసి 33వ వార్డు క్లస్టర్ ఇన్‌ఛార్జి, టిడిపి బిసి గవర సామాజిక సాధికారిక సమితి రాష్ట్ర సభ్యురాలు తిరుమల దేవి చక్రవర్తి టిడిపి జాతీయ అధ్యక్షులు, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును మంగళగిరిలోని టిడిపి కేంద్ర కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. 33 ఏళ్లుగా పార్టీ ఆదేశాలను తూచా తప్పకుండా ఆచరిస్తూ క్రమశిక్షణగల కార్యకర్తగా ఎన్నో కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. తనకుగానీ, తన భర్త చక్రవర్తికిగానీ ఎమ్మెల్సీ పదవి లేదా రాష్ట్రస్థాయి నామినేటెడ్ ఛైర్మన్ పదవి కేటాయించాలని కోరారు. ఈ మేరకు వినతిపత్రం సమర్పించారు.

యుపి మత విషాదంపై విచారణ జరపాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో మత కార్యక్రమంలో 116 మంది మృతి చెందిన సంఘటనపై సుప్రీంకోర్టు న్యాయమూర్తితో విచారణ జరిపించాలని, సంఘటన బాధ్యులను వెంటనే అరెస్టు చేయాలని భారత నాస్తిక సమాజం కేంద్ర కమిటీ సభ్యులు జె.రవి, టి.శ్రీరామమూర్తి కోరారు. ఈ మేరకు వారు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

పార్కు, కల్యాణ మండపం ఏర్పాటుకు కృషి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : దక్షిణ నియోజకవర్గంలోని 32వ వార్డు నేరెళ్ల కోనేరు ప్రాంతంలో ఖాళీగా ఉన్న స్థలంలో పార్కు, కల్యాణ మండపం జివిఎంసి నిర్మించాలని వార్డు జనసేన కార్పొరేటర్ కందుల నాగరాజు కోరారు. ఆ దిశగా తానూ కృషి చేస్తానన్నారు. బుధవారం జోన్ 4 ఎసిపి కె.ఝాన్సీలక్ష్మి 32వ వార్డులో పర్యటించారు. ఈ క్రమంలో వార్డులోని పలు ప్రాంతాలను ఆమె సందర్శించారు. అనంతరం కార్పొరేటర్ నాగరాజు మాట్లాడుతూ వార్డులో కల్యాణమండపం ఏర్పాటు ఇక్కడి ప్రజల ఎన్నో ఏళ్ల కల అని, పార్కు కూడా నిర్మించాలన్నది వారి అభిమతమని అన్నారు. కార్యక్రమంలో నేరెళ్ల కోనేరు సెక్రటరీ వెంకటేష్, అల్లిపురం సెక్రటరీలు రాజేష్, ప్రతాప్, సంపత్ పాల్గొన్నారు.

స్టూడెంట్ కిట్స్ పంపిణీ

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : డాబాగార్డెన్స్ రంగా వీధిలో ఉన్న జివిఎంసి రమాదేవి భానోజీ యుపి స్కూలును హైస్కూలుగా అప్‌గ్రేడ్ చేసేందుకు తాను కృషి చేస్తానని దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ అన్నారు. బుధవారం ఈ స్కూలులో జరిగిన కార్యక్రమంలో విద్యార్థులకు స్టూడెంట్స్ కిట్స్ పంపిణీ చేశారు. స్కూల్లోని అన్ని గదులను, ఇతర వసతులను పరిశీలించారు.

ప్రమాదకరంగా అంతర్రాష్ట్ర రహదారి

అడుగడుగునా పెద్ద పెద్ద గోతులు పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి-చింతూరు

మండలంలోని ఎర్రంపేట నుండి ఒడిశాలోని మల్కన్‌గిరి జిల్లాకు వెళ్లే అంతర్రాష్ట్ర రహదారి ప్రమాదకరంగా ఉంది. రహదారిలో అడుగడుగునా పెద్ద పెద్ద గోతులు ఏర్పాడ్డాయి. ఆ గోతుల్లో వర్షపు నీరు చేరడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని వాహనదారులు భయాందోళన చెందుతున్నారు. పాదచారులు కూడా నడిచేందుకు వీలు లేకుండా బురదతో గోతులు నిండి ఉన్నాయి. ఈ రహదారి గుండా ఒడిశాతో పాటు చత్తీస్‌ఘడ్ రాష్ట్రం నుండి వాహనాల రాకపోకలు సాగిస్తూ ఉంటాయి. హైదరాబాద్, విజయవాడ, పాడేరు, భద్రాచలం, రాజమండ్రి వంటి ప్రాంతాలకు భారీ నుండి అతి భారీ వాహనాలు ఈ రహదారి గుండానే వెళుతుంటాయి. ఎంతో ప్రాముఖ్యత కలిగిన ఈ అంతర్రాష్ట్ర రహదారిపై పెద్ద పెద్ద గోతులు ఏర్పడటం, వాట్లో వర్షపు నీరు చేరి గోతుల లోతు తెలియకపోవడంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని వాహనదారులు భయపడుతున్నారు. ఈ రహదారి మరమ్మతులు చేయాలని గతంలో అనేక సార్లు అధికారులకు విన్నవించారు. ఈ నేపథ్యంలో నాలుగు నెలల క్రితం కంకర వేసి తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు. అయితే ఇటీవల కాలంలో తరచూ వర్షాలు పడడంతో మళ్లీ యథావిధిగా గోతులు ఏర్పడ్డాయి. ఇప్పటికైనా అధికారులు చొరవ చూపి ఈ రహదారికి శాశ్వత మరమ్మతులు చేపట్టాలని వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు.



గుంతల్లో నీరు చేరి అధ్వానంగా ఉన్న రోడ్డు

డయేరియాపై రోగులకు అవగాహన

ప్రజాశక్తి-రంపచోడవరం : స్టాప్ డయేరియా క్యాంపెయిన్‌లో భాగంగా బుధవారం స్థానిక ఏరియా ఆసుపత్రిలో రోగులకు డయేరియాపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.లక్ష్మి మాట్లాడుతూ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. నీళ్ల విరోచనాలు, వాంతులు అయితే చికిత్స తీసుకోవాలన్నారు. చిన్న పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ ఆదిలక్ష్మి పిల్లల ఆరోగ్యం గురించి తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలియజేశారు. ఆర్ఎంఒ ఇందిర ఏరియా ఆసుపత్రిలో లభించు మందులు గురించి వివరించారు.

ఆసుపత్రి కౌన్సిలర్ ఎన్.వాసు తల్లి, బిడ్డలకు కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో హాస్పిటల్ స్టాఫ్, హెడ్ సిస్టర్స్, డాక్టర్లు పాల్గొన్నారు.

జెడ్‌పి హైస్కూల్‌ను సందర్శించిన డిఇఒ



విద్యార్థులతో మాట్లాడుతున్న డిఇఒ బ్రహ్మాజీరావు

ప్రజాశక్తి-చింతూరు

అల్లూరి సీతారామరాజు జిల్లా విద్యాశాఖ అధికారి పి.బ్రహ్మాజీరావు బుధవారం చింతూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వారికి తగిన సలహాలు ఇచ్చారు. పాఠశాల ఆవరణం, క్రీడా మైదానం, వివిధ ఆటల స్థలాలను పరిశీలించారు. అనంతరం ఉపాధ్యాయులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారులు లక్ష్మీనారాయణ, వెంకటేశ్వర్లు, లక్ష్మయ్య, పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.బాలకృష్ణ, సుబ్బయ్య, స్వాతి, నాగరాజు, భద్రయ్య, సుజాత, ఎ.రమేష్, శ్రీనివాస్, పెంటమ్మ, రత్తయ్య, రాజు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

డిఇఒ బ్రహ్మాజీరావుకు సన్మానం

డిఇఒ బ్రహ్మాజీరావును ప్రముఖ ఆయుర్వేద వైద్యులు జమాల్ ఖాన్ బుధవారం శాలువా కప్పి మెమొంటో ఇచ్చి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జమాల్‌ఖాన్ మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతంలో విద్యాభివృద్ధి, మెరుగైన ఫలితాల కోసం చర్యలు తీసుకోవాలని కోరారు.

డిఈఓ బ్రహ్మాజీరావు మాట్లాడుతూ జమాల్‌ఖాన్ మన్య ప్రాంతంలో ఎంతో మంది రోగులకు వైద్య సేవలు అందిస్తూనే, ఆపన్నులకు అండగా ఉంటూ జెకెసి ట్రస్టు ద్వారా సహాయం అందించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు తుర్రం లక్ష్మణ్, శ్యామల సుబ్బయ్య, భద్రయ్య, జెకెసి ట్రస్ట్ సభ్యులు ఎస్కే షాజహాన్, రియాజ్, ఇంతియాజ్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

స్నేహితుని కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-విఆర్.పురం : తమతో చదువుకున్న స్నేహితుడు తండ్రి అనారోగ్యానికి గురి కావడంతో ఆయన కుటుంబానికి పూర్వ విద్యార్థులు ఆర్థిక సాయం అందించి ఔదార్యాన్ని చాటుకున్నారు. మండలంలోని సున్నంవారిగూడెం ఆశ్రమ ఉన్నత పాఠశాలలో 2010-11లో పదో తరగతి చదువుకున్న ఆసు రామకృష్ణ తండ్రి ఆసు తమ్మయ్య అనారోగ్యంతో బాధపడుతున్నారు. వైద్య ఖర్చులకు ఇబ్బంది పడుతున్న విషయాన్ని తెలుసుకున్న 2010-11 బ్యాచ్ విద్యార్థులు బుధవారం సోములగూడెం గ్రామానికి వెళ్లి స్నేహితుడు రామకృష్ణ ఆయన తండ్రి తమ్మయ్యను పరామర్శించారు. కొంత నగదును అందజేశారు.

సీలేరు నదిలో వలకు చిక్కిన అరుదైన చేప

ప్రజాశక్తి - సీలేరు : జీకే వీధి మండలం సీలేరు నదిలో అరుదైన గెలాస్కోపి చేప మత్స్యకారుల వలకు బుధవారం చిక్కింది. వారం రోజుల నుంచి ఆంధ్ర ఒరిస్సా సరిహద్దు సీలేరు పరిసర ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు కొండలు గుట్టలు వాగుల నుంచి వచ్చిన బురదనీరు సీలేరు నదిలో చేరింది. వరదనీటితో వచ్చే వ్యర్థాలు తినేందుకు చేపలు సీలేరు నదిలో ఎగబడు తుంటాయి. ఈ తరుణంలోనే మత్స్యకారులకు బుధవారం అరుదైన గెలాస్కోపి 11 కేజీల చేప చిక్కింది. ఈ చేప కేజీ రూ.200 చొప్పున కొనుగోలు చేసేందుకు పలువురు ఎగబడ్డారు.



మత్స్యకారునికి చిక్కిన గెలాస్కోపీ చేప

89 మందికి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని యర్రంపాడు, గింజర్తి గ్రామాలలో బుధవారం ఫ్యామిలీ డాక్టర్‌లో భాగంగా నిర్వహించిన వైద్య శిబిరంలో 89 మందికి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు 104 డీఈఓ శ్రీనివాస్ తెలిపారు. బాలింతలు, గర్భిణులు, 0 నుండి 5 సంవత్సరాల పిల్లలకు వైద్య సేవలు అందించినట్లు చెప్పారు. బిపి, షుగర్, సాధారణ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్ పి.లక్ష్మణ్, హెచ్‌వి రమాబాయి, ఏఎన్ఎం సుజాత, హెల్త్ అసిస్టెంట్ లక్ష్మయ్య, అంగన్వాడీ టీచర్ అరుణకుమారి, ఆశా వర్కర్ కుమారి,104 పైలెట్ శివకనక రాజు పాల్గొన్నారు.

వాలమూరులో రెవెన్యూ గ్రామసభ

ప్రజాశక్తి-మారేడుమిల్లి : మారేడుమిల్లి మండలం జిఎం.వలస పంచాయతీ వాలమూరు గ్రామంలో తహశీల్దారు వెంకటరమణ ఆధ్వర్యంలో బుధవారం రెవెన్యూ గ్రామసభ నిర్వహించారు. పంచాయతీలో నెలకొన్న సమస్యలను తెలియజేశారు. కుల, ఆదాయ, జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు, భూముల మ్యూటిషన్, రేషన్ కార్డులు తదితర విషయాలపై తహశీల్దారు తెలియజేశారు. కార్యక్రమంలో జిఎంవలస సర్పంచ్ లక్ష్మి, ఎంపీటీసీ సువర్ణరాజు, డిటి బాలాజీ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఆశ్రమ పాఠశాలలో వైద్య శిబిరం

ప్రజాశక్తి-కొయ్యూరు : మండలంలోని రావణాపల్లి ఆశ్రమ పాఠశాలలో బుధవారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో డాక్టర్ మనోజ్ఞ 420 మంది పిల్లలకు వైద్య చికిత్సలు చేశారు. ఈ సందర్భంగా మనోజ్ఞ మాట్లాడుతూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకుంటే డయేరియా, మలేరియా వ్యాధులకు దూరంగా ఉండవచ్చని చెప్పారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఓ ప్రశాంత్‌కుమార్, హెల్త్ అసిస్టెంట్ మంగరాజు, ఏఎన్ఎం పుష్పవల్లి, హెచ్‌విఎంఎల్‌హెచ్‌పి సిబ్బంది పాల్గొన్నారు.

రహదారిపై కూలిన భారీ వృక్షం

ప్రజాశక్తి-సీలేరు : జీకే వీధి మండలంలో మంగళవారం అర్ధరాత్రి ఈదురుగాలులు, భారీ వర్షానికి దారకొండ పంచాయతీ కమ్మరి తోట సమీపంలోని దారకొండ - గుమ్మరేవులకు వెళ్లే రహదారిపై పెద్ద చెట్టు కూలిపోయింది. దీంతో ఈ మార్గంలో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. రెండు వైపులా వాహనాలు నిలిచిపోయాయి. ఆర్ అండ్ బి అధికారులు మాత్రం చెట్టును తొలగించడానికి ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంతో గుమ్మరేవులు పంచాయతీ పరిధిలోని సచివాలయ, వైద్య సిబ్బంది, ఉపాధ్యాయులు రవాణా సౌకర్యం లేక వెనక్కి పోవాల్సి పరిస్థితి నెలకొంది. వ్యాపారులు పాతకోట సంతకి వెళ్లలేకపోయారు. ఇప్పటికైనా ఆర్ అండ్ బి అధికారులు స్పందించి ఈ వృక్షాన్ని తక్షణమే తొలిగించి రాకపోకలు పునరుద్ధరించాలని వాహనదారులు కోరుతున్నారు.